రోడ్లపై, కాలువల్లో చెత్త వేస్తే కఠిన చర్యలు మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణ ప్రజలు మున్సిపల్ రోడ్డు, కాలువాల్లో విచ్చలవిడిగా చెత్తను వేస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి హెచ్చరించారు. గురువారం మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా శానిటరీ ఇన్స్పెక్టర్, పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీలతో శ్వేత చలపతి స్కూలు రోడ్డు, మెయిన్ రోడ్డు, మార్కెట్, మహారాణిపేట గొల్ల వీధి ఏరియాలలో పర్యటించారు.శ్వేత చలపతి స్కూల్ ఎదురుగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద చెత్తలు వేస్తున్న షాపులు యజమానులను గుర్తించి వారికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. గొల్ల వీధి మెయిన్ రోడ్డులో ఓపెన్ ప్లేస్ లో ఉన్న చెత్తలను ఏరివేయించాలని ఆదేశించారు, చిన్నచెరువు గట్టు వీధిలో కాలువలలో సిల్టు తొలగించాలని ఆదేశించారు, గార్బేజ్ వలనరబుల్ పాయింట్లను గుర్తించి క్లియర్ చేయించాలని అక్కడ మరల చెత్తలు వేయకుండా చూడాలని ఆదేశించారు.

మండల పరిషత్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- సంతకవిటి/ రాజాం: సంతకవిటి మండలం సిరిపురం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నాడు సంక్రాంతి సంబరాలు ప్రధానోపాధ్యాయులు బొత్స జానకిరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈరోజు గంగిరెద్దు హరిదాసు వేషాలు వేశారు. ఒకటవ తరగతి విద్యార్థినిలు గోపికమ్మ వస్త్రధారణతో వచ్చారు. కోలాటం నృత్యాలు పాఠశాలలో ఏర్పాటు చేశారు. భోగి మంటలు వేసి పిల్లలు భోగిమంట చుట్టూ చేరి సంబరాలు చేసుకున్నారు. విద్యార్థినిలు రంగురంగుల రంగవల్లులు వేశారు. పాఠశాల ఆవరణ అంతా విద్యార్థులతో సందడిగా సంక్రాంతి సంబరాలు జరిగాయి. ఈరోజు పాఠశాల ఆవరణమంతా పండుగ వాతావరణంతో విద్యార్థులు చాలా సంతోషంతో కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. ఉపాధ్యాయులు పొండ్రంకి గణపతి, కే.జి.ఎస్ ప్రకాష్, తులసీదాస్, సరోజినీ దేవి, బాబురావు, రాజులు మాస్టారు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు రూ.20 వేలు బట్టలు వితరణ

డిఎఫ్‌యన్ కంపెనీ మేనేజర్ విశ్వనాథం నాయుడు

విశాలాంధ్ర-గరివిడి: స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏ. విశ్వనాథం నాయుడు మేనేజింగ్ డైరెక్టర్ మైనింగ్ డి.ఎఫ్.యన్ తన జన్మదినం సందర్భంగా గరివిడి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తల్లిదండ్రులును కోల్పోయిన 9 మంది విద్యార్థిని, విద్యార్థులు కు ఒక్కొక్కరికి 2 జతలు చొప్పున బట్టలు ఇవ్వడం జరిగింది. మొత్తం 18 జతలకు గాను సుమారుగా 20000 వేల రూపాయలు వెచ్చించారు, వారిని మండల పరిషత్ అధికారి పి.రామారావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారులు అభినందిస్తూ దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధికారి సుబ్రహ్మణ్యం, మండల విద్యాశాఖ అధికారులు పి.రామారావు, డి.అప్పన్న, మండల విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సోంపురం జెడ్పీ హైస్కూల్లో సంక్రాంతి సంబరాలు

హెచ్ఎం బిపిఏ రాజు

విశాలాంధ్ర -వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిం చబడ్డాయని పాఠశాల ప్రధానోపా ధ్యాయులు బి.పి.ఏ.రాజు తెలియజేశారు. సంక్రాంతి సెలవులకు ముందు విద్యార్థులకు సనాతన సంప్రదాయ కార్యక్రమాల పరిచయంలో భాగంగా రంగోలి, భోగి మంట,సంక్రాంతి హరిదాసు,గంగిరెద్దు వేషధారణలో సుధీర్,చైతన్య, రోహిత్,మొదలైన విద్యార్థులు, తిరుచిరాపల్లిలో జరగనున్న జాతీయ జంబోరీలో పాల్గొనబోవు సేవాశ్రీ స్కౌట్ యూనిట్, రుద్రమ దేవి గైడ్ యూనిట్ ఆధ్వర్యంలో థింసా, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. అలాగే మధ్యాహ్నం, సంక్రాంతి శుభదిన భోజన కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్న భోజన మెనుకు అదనంగా అరటికాయ కూర వడ్డించారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు పి.సన్యాసిరావు, వ్యాయామ ఉపాధ్యాయులుఎస్.గోవిందరావు ఇతర ఉపాధ్యాయుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది.

ముందుగా భోగి పండుగ జరుపుకున్న విద్యార్థులు

విశాలాంధ్ర -లక్కవరపుకోట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు సంక్రాంతి సెలవులు ప్రకటించిన సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం విద్యార్థుల చేత సాంప్రదాయ దుస్తులు ధరించి వివిధ రకాల సంక్రాంతి పండుగ సందర్భంగా హరిదాసు, మేలుకొలుపు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భోగిమంట వేసి 2025 సంవత్సరంలో భోగభాగ్యాలు కలిగి చక్కని విద్య అభ్యసించాలని, ఉపాధ్యాయ బృందం అంతా విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి ఘటన దురదృష్టకరం

- ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమే ..
- సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మిరమణ

విశాలాంధ్ర-విజయనగరం : తిరుపతిలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, దైవ దర్శనానికి వచ్చి మృతి చెందడం అత్యంత దారుణమైన సంఘటన అని జిల్లా సిపిఐ కార్యదర్శి ఒమ్మిరమణ అన్నారు. గురువారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇది ముమ్మా టికీ ప్రభుత్వం, ముఖ్యంగా టీటీడీ వైఫల్యంగానే భావిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా లక్షలాదిమంది భక్తులు వైకుంఠ ఏకాదశికి వస్తుంటారని, ఇది తెలిసికూడా ముందస్తుగా తగిన చర్యలు చేపట్టక పోవడం చూస్తే ప్రజల ప్రాణాల పట్ల ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో తెలుస్తోందన్నారు. తిరుపతి సంఘటనలో ఏడుగురు మృతి చెందగా, 40 మంది వరకు తీవ్రంగా గాయాలపాలయ్యారని, ఇది తిరుపతి చరిత్రలో అత్యంత దారుణ సంఘటనగా మిగిలిపోతోందన్నారు. హైందవ శంఖారావానికి, విశాఖలోని మోదీ పర్యటనకు వేలాదిగా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసిన ప్రభుత్వం వైకుంఠ ఏకాదశికి వచ్చే లక్షలాది భక్తులను అదుపు చేసేందుకు ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. వెంటనే సంఘటనలో మృతి చెందిన వారికి ఒక్కొక్కరికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని, అలాగే గాయపడిన వారికి పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా కేంద్రం కొత్తపథకం

- భీశెట్టి బాబ్జి

-గడ్కరీ కి ప్రత్యేక అభినందనలు తెలిపిన లోక్ సత్తాపార్టీ

విశాలాంధ్ర -విజయనగరం రూరల్: కేంద్ర రోడ్డు, ఉపరితల రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ దేశంలో రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ఒక గొప్ప పథకానికి శ్రీకారంచుట్టడం అభినందనీ యమని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చులో గరిష్టంగా రూ 1.50 లక్షలు కేంద్ర ప్రభుత్వమే భరిస్తుందని, ప్రమాదం ఘటన జరిగిన 24 గంటల్లో పోలీసు లకు తప్పకుండా సమాచారం అందించాలని,అలాగే హిట్ అండ్ రన్ కేసులో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియోను అందిస్తామని గడ్కరీ ప్రకటించడం విశేషమని,ఇప్పటికే దేశంలోని అస్సాం, చండీగఢ్,పంజాబ్, ఉత్తరాఖండ్, పాండిచ్చేరి, హర్యానాలో 6,840 మంది ఈ స్కీం ద్వారా లబ్ధి పొందారని 2025 మార్చి నుండి దేశవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారని,దేశవ్యాప్తంగా 2024 లో 1.80 లక్షల మంది రోడ్డుప్రమాదంలో చనిపో యారని దీనిలో 30 వేలమంది కేవలం హెల్మెట్ ధరించక చనిపోయారని,రోడ్డు ప్రమాదంలో 66 శాతం మంది 18 నుండి 34 ఏళ్ల లోపు యువతే ఉన్నారని, విద్యాసంస్థలు వద్ద ఎంట్రీ,ఎగ్జిట్, పాయింట్స్ సరిగా లేక 10 వేలమంది పిల్లలు రోడ్డు ప్రమాదాల బారినపడ్డారని గడ్కరీ ప్రకటించడం ఆందోళన కలిగించే అంశమని భీశెట్టి అన్నారు,రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు జాతీయ స్థాయిలో సాంకేతిక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారని,లక్షన్నర తో ఉచిత చికిత్స పొందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయం చేసిన నితిన్ గడ్కరీ కి లోక్ సత్తాపార్టీ నుండి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పొరవేదిక ప్రతినిధి తాడేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విలువైన వస్తువులను ఇళ్లల్లో ఉంచరాదు : సి.ఐ శంకర్రావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: సంక్రాంతి పండగ సెలవుల నేపథ్యంలో దూరప్రాంతాలకు ప్రయాణాలు సాగించేవారు వారి ఇళ్లల్లో విలువైన బంగారం, నగదు, తదితర వస్తువులను ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ జి శంకర్రావు అన్నారు. గురువారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ చీపురుపల్లి సర్కిల్ పరిధిలో సంక్రాంతి సెలవుల్లో భాగంగా దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నా మన్నారు. ప్రజలకు కూడా దొంగతనాల నివారణకు తమ వంతు సహకారం అందించాలన్నారు. సర్కిల్ పరిధిలో దొంగతనాలు జరగకుండా ప్రత్యేక బృందాలను గస్తీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రత్యేకించి శివార్లలో ఒంటరిగా గల గృహ సముదాయాల యాజమాన్యాలు పండగ సెలవుల రీత్యా సుదూర ప్రాంతాలకు ప్రయాణాలు జరిపితే వారి యొక్క పూర్తి సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియజేయాలన్నారు. అదేవిధంగా నగర శివారులలో ఒక్కో కుటుంబం నివసించే వారి వివరాలను కూడా స్థానిక స్టేషన్లో తెలియజేయాలన్నారు. దొంగతనాల నివారణలో భాగంగా ముందస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రత్యేకించి సంక్రాంతి వేడుకల్లో భాగంగా కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. రహస్యంగా ఎక్కడైనా కోడిపందాలు పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని ఈ సందర్భంగా సిఐ కోరారు. సంక్రాంతి వేడుకలను ప్రతి ఒక్క కుటుంబము ఆనందంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, ప్రమాదాలకు గురి కావడం వలన పండగ సమయంలో ఆయా కుటుంబంలో విషాదంలో మునుగుతాయని అటువంటి చర్యలకు ఏ ఒక్కరూ పాల్పడకూడదని ఆయన కోరారు. ప్రత్యేకించి పండగ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వారి పైన, రికార్డులు లేని వాహనదారుల పైన, మద్యం సేవించి వాహనం నడిపిన వారి పైన, మైనర్లు వాహనాలు నడపడం పట్ల పోలీసులు బృందాల వారీగా తనిఖీలు నిర్వహిస్తారన్నారు. తనిఖీలలో పట్టుబడిన వారి పైన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ వివరించారు.

సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో ఫోక్సకన్ వారిచే క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సత్య డిగ్రీ & పీజీ కళాశాలలో గురువారం ఫోక్సకన్ వారిచే క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడినది. బి ఎస్ సి విద్యార్థులు హాజరు అయ్యారు. వీరికి జామ్, గ్రూప్ డిస్కషన్స్ మరియు ఇంటర్వ్యూ నిర్వహించి 20 మంది విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. వీరికి 2.5లక్ష ల ప్యాకేజీ తో అవకాశాలు అందజేశారు . ఈ ఎంపిక ప్రక్రియను ఫోక్సకన్ మానవ వనరుల శాఖ నిర్వహించింది. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దానికి వారు ఎల్లప్పుడూ తయారు అయ్యి ఉండాలని విద్యార్థులకు తెలియజేసారు.సత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మాట్లాడుతూ విద్యార్థులకు మరిన్ని అవకాలను కల్పిస్తామని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్ కెప్టెన్ ఎం సత్య వేణి, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ సురుపునాయుడు ట్రైనింగ్, ప్లేస్మెంట్ ఆఫీసర్లు షాజీ నాయర్, లెఫ్టినెంట్ ఎం ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు

అమిత్ షా క్షమాపణ చెప్పకపోతే దేశమంతా ఆందోళన

విశాలాంధ్ర -విజయనగరం ఫోర్ట్: రాజ్యాంగ నిర్మాతగా పేరుగాంచిన అంబేద్కర్ భారత జాతికి దేవుడు అని కొనియాడారు. ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. అటువంటి మహనీయుడిపై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఖండించకపోవడం దారుణమన్నారు. అమిత్ షాను వెంటనే మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. రుద్రరాజు, మస్తాన్ వలీ మాట్లాడుతూ రాజ్యాంగ పదవులు అనుభవిస్తున్న వ్యక్తులు అంబేద్కర్ ను అవమానించడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. నవ సత్యాగ్రహం పేరిట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశమంతా ఆందోళన చేపడుతున్నట్లు చెప్పారు. అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పకపోతే 26 నుంచి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జ్ గంటా సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిబింబించిన సంక్రాంతి శోభ

విశాలాంధ్ర భోగాపురం : మండలంలోని కొంగ వారి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంట వేసి అందులో విద్యార్థులు తయారుచేసిన భోగి పిడకల దండను వేశారు. సంక్రాంతి పండుగ సమయంలో కనిపించే పండగ వాతావరణాన్ని ప్రతిభింబించే విధంగా విద్యార్థులు తెలుగింటి సాంప్రదాయ వస్త్రధారణలో సందడి చేసారు. విద్యార్థుల హరిదాసు, కొమ్మదాసులవాడు, బుడబుక్కల వేషాలు వేసి ఈనాటి తరానికి వారి గురించి తెలియజేశారు. పాఠశాల ఆవరణలో రంగవల్లికలను తీర్చిదిద్ది,గాలిపటాలు ఎగురవేసి విద్యార్థులు ఆనందంతో కేరింతలు కొట్టారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన రంగవల్లికలు పోటీల్లో విజేతలైన వారికి ప్రధానోపాధ్యాయురాలు వెంకటేష్ చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ మాట్లాడుతూ తెలుగువారి సంస్కృతి సాంప్రదాయాలను ఈనాటి తరం విద్యార్థులు తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని చెప్పారు. సంక్రాంతి పండుగ ప్రాశస్త్యం గురించి ఈ తరం పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పబ్బిరెండి శివప్రసాద్, జి. మిన్నారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం సీతంపేట గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి రాజ్యాంగాన్ని కాపాడమంటూ వినదపత్రాన్ని ఇచ్చారు ఈ సందర్భంగా ఇటీవల కాలంలో అంబేద్కర్ ను అగౌరవపరుస్తూ చేసినటువంటి వ్యాఖ్యలను ఉద్దేశించి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని మరియు అంబేద్కర్ కు క్షమాపణ తెలియజేయాలని కోరారు ఈ కార్యక్రమంలో పదాల మణిబాబు హెచ్ నానాజీ ,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు చింతల ఈశ్వరరావు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పూడి శ్రీనివాసరావు ఎల్కోట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గురు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కిర్లంపూడి రాణీ . రాణీ షణ్ముఖవల్లి దేవీ మృతి

సంతాపం తెలిపిన బొబ్బిలి రాజకుటుంబం

విశాలాంధ్ర-బొబ్బిలి: ఎమ్మెల్యే బేబినాయన పిన్నమ్మ అయిన కిర్లంపూడి రాణీ , షణ్ముఖవల్లి దేవీ ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున కన్నుమూశారు.. షణ్ముఖవల్లి దేవీ తమిళనాడులో శివగంగా సంస్థానానికి చెందిన శివగంగా రాజా కుమార్తె వారి మృతి విషయాన్ని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడినిబొబ్బిలి రాజవంశీయులు, ఆర్.వి.ఎస్.కె. రంగారావు (సుజయ్ నాయన), ఆర్.వి.ఆర్.కె.రంగారావు (రాము నాయన), ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీనాయన) కోరారు.

విశాఖ పర్యటనకు వచ్చిన ప్రధానిని కలిసిన

ఎమ్మెలే బేబీ నాయన

విశాలాంధ్ర-బొబ్బిలి : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటన అనంతరం, వారికి వీడ్కోలు పలికిన క్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు తమను తాము పరిచయం చేసుకున్నారు.. ఎమ్మెల్యే బేబీనాయన పరిచయం చేసుకుంటూ, తమ తాత ఉమ్మడి మద్రాసు రాష్ట్రానికి ఆఖరి ముఖ్యమంత్రిగా జస్టిస్ పార్టీ తరుపున పనిచేశారని, వారి మనవడిగా కూటమి ప్రభుత్వంలో పనిచేయడం గర్వంగా ఉందని ప్రధానితో చెప్పారు. అలాగే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారానికి ఎమ్మెల్యే బేబీనాయన ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు.

సమస్యలపై గళమెత్తిన ఎంపిపి అనూష రెడ్డి

విశాలాంధ్ర-భోగాపురం: జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మండల సమస్యలపై ఎంపిపి అనూష రెడ్డి గళమెత్తారు. చాల కాలంగా తీర ప్రాంత గ్రామలైన ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపల కంచేరు గ్రామ పంచాయతీ లలో ఉప్పు గాలి వలన కరెంటు వైర్లు, కండక్టర్లు పాడైపోతున్నాయని, కరెంటు స్తంభాలు కూడా అనేక చోట్ల పాడైపోయాయని, క్రొత్త స్తంభాలు వేయాల్సి ఉన్నదని, జిల్లా పరిషత్ చైర్మన్ ,జిల్లా కలెక్టర్ కు విన్నవించామని ఆమె తెలిపారు. అలాగే మండలానికి రావలసిన స్టాంప్ డ్యూటీ 7 నెలలకు మాత్రమే ఇచ్చారని, మిగిలిన నెలలకు ఇంకా ఇవ్వవలసి ఉన్నదని ఈ విషయాన్ని చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. దీనిపై జిల్లా పరిషత్ చైర్మన్ సానుకూలంగా స్పందించి తీర ప్రాంత మండలాలకు విద్యుత్ సమస్యలు లేకుండా ఉండేందుకు గాను సరిపడే బడ్జెట్ ను విద్యుత్ శాఖ వారు తీర ప్రాంత మండలాలకు కేటాయించాలని విద్యుత్ శాఖ ఎస్.ఇ కి చైర్మన్ సూచించారని తెలిపారు. అలాగే భోగాపురం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఉన్న భోగాపురం, పూసపాటి రేగ, డెంకాడ మండలాలకు కొంతవరకు స్టాంప్ డ్యూటీసర్దు బాటు చేశామని, అతి త్వరలో మార్చి 2023 (6 నెలల స్టాంప్ డ్యూటీ) వరకు విడుదల చేసి, జమ చేయిస్తామని, మిగిలిన కాలానికి విడతల వారిగా జిల్లా వ్యాప్తంగా, అన్ని మండలాలకు, గ్రామ పంచాయతీలకు జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చైర్మన్ తెలిపారని ఆమె వెల్లడించారు.

2025-26 ఆర్థిక సంవత్సరానికి 497.96 కోట్ల అంచనా బడ్జెట్

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆమోదం తెలిపిన సభ్యులు
- జలాశయాల వద్ద విగ్రహాల ఏర్పాటు : చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- వికలాంగ పించన్లపై ఆందోళన వద్దు -రీ వెరిఫికేషన్ మాత్రమే చేస్తున్నాం : స్పష్టం చేసిన కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: 2025-26 ఆర్థిక సంవత్సరానికి 497.96 కోట్ల అంచనా బడ్జెట్ ను జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అలాగే 2024 -25 ఆర్థిక సంవత్స రానికి సవరించిన బడ్జెట్ 496.35 కోట్ల రూపాయలకు కూడా ఆమోదం తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ సర్వ సభ్యసమావేశం జరిగింది. బడ్జెట్ ఆమోదం అనంతరం పలు అంశాల పై తీర్మానాలు చేసారు. శాఖల పని తీరు పై సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు మాట్లాడుతూ రైతాంగానికి సాగు నీరందించే ఉద్దేశ్యం తో జిల్లాలో జలాశయాల నిర్మాణానికి కృషి చేసిన మహనీయుల పేర్లను పెట్టుకొని భావి తరాలకు వారి సేవలను గుర్తుండేలా చేయడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను కూడా నిర్మించి పార్క్ లను ఏర్పాటు చేస్తే వారికీ సముచితమైన గుర్తింపునిచ్చినట్లు అవుతుందని తెలిపారు. తోటపల్లి ప్రాజెక్ట్ కు సర్దార్ గౌతు లచ్చన్న పేరును, జంఝావతి కి వాసిరెడ్డి కృష్ణ మూర్తి నాయుడు పేరును, మడ్డువలసకు గొర్లె శ్రీరాములు నాయుడు పేరును, తాటిపూడి జలాశయానికి గౌరీపాటి బుచ్చి అప్పారావు పేరును పెట్టడం జరిగిందని, అయితే ఆయా జలాశయాల వద్ద వారి విగ్రహాలను ఏర్పాటు చేసి, పార్క్ లను నిర్మించి సుందరంగా తీర్చి దిద్దాలని, నిధులు అవసరమైతే జిల్లా పరిషత్ నుండి సమకూర్చడం జరుగుతుందని, ఆ మేరకు తీర్మానం చేసారు. ఉద్యాన శాఖ సమీక్షలో భాగంగా జిల్లాలో మామిడి అధికంగాసాగులో ఉందని, ఎగుమతులు కూడా జరుగుతున్నాయని, మామిడి పంట ఇన్సురెన్సు కోసం ఎకరానికి 2 వేల రూపాయల ను ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ ప్రీమియం ను తగ్గించాలని, అలాగే ఇన్సూరెన్స్ గడువును కూడా పొడిగించాలని తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలని కోరగా కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పరిశీలించి లేఖ రాస్తామని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో కూడా జీడి మామిడి పంటకు హెక్టార్ కు 4 వేల రూపాయలు ప్రీమియం ఉందని, దానిని తగ్గించాలని లేఖ రాయడం జరిగిందని మన్యం కలెక్టర్ శ్యాం ప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు , విధానాలు ప్రజలకు తెలిసే లోపే వాటి గడువు అయిపోతుందని, ప్రజలకు తెలిసేలా ప్రచారం గావించాలని పలువురు సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ గ్రామ స్థాయి, మండలస్థాయి సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరై, ప్రభుత్వ పథకాలు, విధానాల పై వివరించాలని , అధికారిక సమేశాలకు తప్పనిసరిగా హాజరవ్వాలని వెంటనే ఆదేశాలు జారీ చేస్తానని తెలిపారు. వికలాంగుల పెన్షన్ ను అనర్హుల పేరుతో తొలగిస్తున్నారని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తు తున్నాయని జిల్లా పరిషత్ చైర్మన్ సభ దృష్టికి తీసుకు వచ్చారు. జిల్లా కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ వికలాంగుల పెన్షన్ తీసేయమని ప్రభుత్వం నుండి ఎటువంటి ఉత్తర్వులు రాలేదని, కేవలం రీ వెరిఫికేషన్ మాత్రమె చేస్తున్నామని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని స్పష్టం చేసారు. వెరిఫికేషన్ కోసం ప్రత్యేక వైద్యులతో 6 టీం లను వేయడం జరిగిందని వారు 15 వేల రూపాయల పించన్ పొందే వారి ఇంటికి వెళ్లి వికలాంగుని ఫోటో తీసే, అక్కడికక్కడే అప్లోడ్ చేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లాలో 32 వేల మంది వికలాంగ పెన్షన్ దారులకు స్క్రీనింగ్ పరీక్ష చేసి సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అంతా ఆన్లైన్ లోనే జరుగుతుందనని , అర్హులైన వారిని తొలగించడం ప్రభుత్వం ఉద్దేశ్యం కాదని , ఎవరైనా అర్హులై ఉండి తొలగిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేసారు. జిల్లా పరిషత్ చైర్మన్ స్పందిస్తూ పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ను కోరారు. పించన్ పొందుతున్న వారు మరణిస్తే వారి జీవిత భాగస్వామికి పించన్ అందేలా ఈ జనవరి నుండి అవకాశం ఇస్తున్నారని, అంతకు ముందు చనిపోయినవారి కుటుంబాలకు కూడా ఈ అవకాశాన్ని కల్పించాలని సభ్యులు కోరారు. ఉత్తర్వులు వెలువడిన నుండే అమలులో ఉంటాయని, పాత వాటికోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామని కలెక్టర్ తెలిపారు. తాటిపూడి బోటు షికారు కోసం అన్ని రకాల అనుమతులు ఉన్నాయా, పర్యాటకుల భద్రత కు ఎటువంటి చర్యలు తీసుకున్నారు అని జిల్లా పరిషత్ చైర్మన్ జలవనరులు, పర్యాటక శాఖల అధికారులను ప్రశ్నించారు. కలెక్టర్ స్పందిస్తూ అన్ని రకాల అనుమతులు ఉన్నాయని, పర్యాటక కార్పొరేషన్, బోటు నడిపే కంపెనీ వారు ఒప్పందం కుదుర్చుకున్నారని, ఇందులో భద్రత, ధర, ఇతర అంశాల పై చర్చించి బోటు నడపాలా వద్దా అనే అంశాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వైద్యశాఖ సమీక్ష లో భాగంగా హెచ్.ఎం.పి.వి వైరస్ పై ప్రజలు ఆందోళన చెందుతున్నారని సభ్యులు తెలుపగా రాష్ట్రం లో ఒక్క కేసు కూడా నమోదు కాలేదని, అయితే అలర్ట్స్ వస్తున్నాయని కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. కోవిడ్ లో తీసుకునే జాగ్రత్తలే తీసుకోవాలని, శీతాకాలం లో వచ్చే వ్యాధులైన జలుబు, దగ్గు, గొంతునొప్పి వస్తే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మాస్క్ ధరించాలని, సానిటైజర్, వాడాలని, జలుబు, దగ్గు ఉన్న వారికీ దూరం పాటించాలని, ఎటువంటి ఆందోళన అవసరం లేదని తెలిపారు. ఉపాధి పనులు పంచాయతీల తీర్మానం లేకుండా చేస్తున్నారని, చట్టాన్ని సక్రమంగా అమలుచేయడం లేదని, అవినీతి జరుగుతోందని పలువురు సభ్యులు సభ ద్రుష్టికి తెచ్చారు. కలెక్టర్ అంబేద్కర్ స్పందిస్తూ ఉపాధి పనులన్నిటినీ నిబంధనల ప్రకారంగానే జరుపుతున్నామని, పనులు, చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల పై అవినీతి ముద్ర వేయడం మంచిది కాదని, ఎక్కడైనా జరిగితే స్పష్టంగా , వివరంగా రాసి ఇస్తే విజిలెన్సు ద్వారా విచారణ చేపడతామని తెలిపారు. గతంలో పని చేసిన మండలాలకు 10 శాతం హెల్డ్ లో ఉంచారని, సోషల్ ఆడిట్ కూడా పూర్తి చేసిన మండలాలకు ఆ మొత్తం రిలీజ్ చేయాలనీ సభ్యులు కోరారు. సోషల్ ఆడిట్ పూర్తైన చోట్ల 10 శాతం నిధులను విడుదలకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డ్వామ పి.డి. కి సూచించారు. ఈ సమావేశంలో శాసన మండలి సభ్యులు డా.సురేష్ బాబు, ఇందుకూరి రఘురాజు, జిల్లా పరిషత్తు సి.ఈ.ఓ సత్యనారాయణ, రెండు జిల్లాలకు చెందిన అధికారులు, ఎం.పి.టీ.సి, జెడ్.పి.టీ.సి సభ్యులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని అక్కివరం ఆదర్శ పాఠశాలలో గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ సంధ్య ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు ముఖ్య అతిథులుగా హాజరైనారు. పూజల నిర్వహించి భోగిమంట వెలిగించి పెద్దలతో విద్యార్థులకు భోగి పండ్లు వేయించి తెలుగువారి సాంప్రదాయం ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా కోలాటం పతంగులు ఎగురువేత రంగోలి పోటీలు మొదలగు కార్యక్రమాలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపల్ సిహెచ్ సంధ్య డి ఈ ఓ రమణ అక్కివరం సర్పంచ్ కందికిరణ్ కుమార్ దాతలు బిహరి ముద్దాడ రాము ఎంఈఓ 2 శ్రీరామ్ పాఠశాల చైర్మన్ కంది అప్పలనాయుడు వైస్ చైర్మన్ గౌడ్ సింహాచలం కంది సురేష్ కంది సత్యనారాయణ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాన్ని అమలు చేయాలి...

14వ రోజుకి చేరిన పౌల్ట్రీ కార్మికుల నిరసన

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి మండలం కర్లాం వెంకటరామ పౌల్ట్రీ ఫారం యాజమాన్యం వేతన ఒప్పందాన్ని అమలు చేయాలంటూ పౌల్ట్రీ ఉద్యోగుల సంఘం చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు నిరసన శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు గురు నాయుడు, వి ఈశ్వరరావు, తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గత 14రోజులుగా పరిశ్రమ ముందు నిరవధిక సమస్య చేపడుతున్నప్పటికీ యాజమాన్యం తమ డిమాండ్లను ఒప్పుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే పలు రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన తాము పలుమార్లు సంఘ నాయకుల ఆధ్వర్యంలో చర్చలకు పాల్గొన్నప్పటికీ తమ డిమాండ్లను యాజమాన్యం ఒప్పుకోకపోవడం శోచనీయమన్నారు. గతంలో యాజమాన్యం ఒప్పుకున్న వేతన ఒప్పందాన్ని అమలుచేయాలంటూ డిమాండ్ చేశారు. శాంతియుతంగా సమ్మె జరుగుతున్న తమ పైన పోలీసులను ఉసుగల్పుతున్నారని ఈ సందర్భంగా కార్మికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం న్యాయబద్ధమైన తమ కోర్కెలను అంగీకరించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా కార్మికులు హెచ్చరించారు. సిఐటియు మద్దతుతోపాటు మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కూడా తమ సమ్మెకు మద్దతు తెలపడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ ముందు వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తూ కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియ

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలకు ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఎం.టి. మరియు పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగు తున్నట్లుగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. జనవరి 9న నిర్వహించిన 8వ రోజు పి.ఎం.టి. మరియ పి.ఈ.టి. పరీక్షలకు 600 మంది పురుష అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా, 375 అభ్యర్థులు మాత్రమే పి.ఎం.టి.పి.ఈ.టి. పరీక్షలకు హాజరయ్యారన్నారు. నియామకాలప్రక్రియ వేకువ జామున 5గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికాబద్ధంగా వ్యవహరించడంతో, పి.ఎం.టి. మరియుపి.ఈ.టి. పరీక్షలు సకాలంలో పూర్తయ్యాయన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు స్వయంగా పర్యవేక్షించారు.అభ్యర్థులకు ముందుగా హాల్ టికెట్స్ పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండులోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవపత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్ మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఏఆర్ అదనపు ఎస్పీ జి. నాగేశ్వరరావు, డిఎస్పీలు ఎం.వీరకుమార్, యూనివర్స్, ఎస్.బాపూజీ, టి.ఎస్.శ్రీనివాసరావు, కే.థామస్ రెడ్డి, ఎఓ పి.శ్రీనివాసరావు, పలువురు సిఐలు, రిజర్వు ఇన్స్పెక్టర్స్, ఎస్సైలు, ఆర్.ఎస్.ఐ.లు పిఈటీలు మరియు ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు. ..

అవయవ దానానికి అంగీకారం

విశాలాంధ్ర-చీపురుపల్లి : చీపురుపల్లి పట్టణానికి చెందిన మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం నాడు పలువురు యువకులు స్వచ్ఛంద అవయవదానానికి అంగీకారం తెలుపుతూ అంగీకార పత్రాలను అందజేశారంటూ ఆ సంస్థ అధ్యక్షులు బివి గోవిందరాజులు విలేకరులకు తెలిపారు. అవయవ దానం అనే బృహత్తర కార్యక్రమంలో మేము సైతం సిద్ధమంటూ వారి అవయవాలు దానం చేయుటకు ముందుకు వచ్చి సంతకాలు చేసిన శేషపు శ్రీ సాయి, మండల చైతన్య, ముత్త కళ్యాణ్, పెద్ది వెంకటేష్, బి సాయి రెడ్డి, పి నందినీలను ఈ సందర్భంగా గోవిందరాజులు అభినందించారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాల పట్ల నేటి యువత మరింత చైతన్యం కావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అవయవ దాన కార్యక్రమానికి స్వచ్ఛందంగా యువత ముందుకు రావడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంబరానంటిన సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని మధు పాడ గ్రామంలో గల సాయి గౌతమి ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు గురువారం సంక్రాంతి సంబరాలు అంబరానంటిన విధంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ ఎస్ నాయుడు ఆధ్వర్యంలో సంబరాలను అద్వితీయంగా నిర్వహించి అందరికీ ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థిని విద్యార్థులు ఆనందోత్సవాలతో మునిగి తేలారు మన విద్యార్థులకు మన పండగ సాంప్రదాయాలను గూర్చి వివరించారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫోర్ట్ సిటీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : పట్టణంలో రింగ్ రోడ్డు వద్ద ఉన్న పోర్ట్ సిటీ పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. పండగల విశిష్టతలనువిద్యార్థులు నృత్యరూపం లోను, నాటికల రూపంలోను, హరిదాసు, సోదెమ్మ వేషాలు ధరించి అందరినీ ఆకట్టుకున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు కూడా ఈ నృత్యములో పాల్గొని సంక్రాంతి పండుగ విశిష్టతను గురించి తెలియజేసారు. ఈ సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న పాఠశాల చైర్మన్ కె.ఎ.పి. రాజు(శివ) మాట్లాడుతూ విద్యార్థులందరూ ప్రతీ పండుగ ప్రాముఖ్యతను గురించి, పండుగలు జరుపుకునే విధానం తెలుసుకోవాలన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఎలా జరుపుకుంటారు. ఎందుకు జరుపుకుంటారీ అనే విష యాలను చక్కగా వివరించారు. రైతన్నలు మెచ్చే ఈ సంక్రాంతి పండుగనాడు అందరూ సాంప్రదాయ దుస్తులు ధరించాలన్నారు. ఈ సంబరాల్లో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రోయి నా ఖాన్ , డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమపాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతం & లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ మధ్య అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: సత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీఅండ్ మేనేజ్‌మెంట్ మరియు లియో గ్లోబల్ ఓవర్సీ స్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎం.ఓ.యు) కుదిరింది. మేనేజింగ్ డైరెక్టర్ లగడపాటి శ్రీనివాసరావు, సీతం కళాశాల ప్రధానోపాధ్యులు డాక్టర్ డి.వి రామమూర్తి ఎంఓయూపై సంతకం చేశారు. ఈ అవగాహనా ఒప్పందం ద్వారా లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ శిక్షణ, విద్య, నియామకం, పారిశ్రామిక సందర్శన, నిపుణుల ఉపన్యాసంలో సహకారంపై వారి ప్రయత్నాలను సహకరించడం, కేంద్రీకరించడం, కెరీర్ కన్సల్టెన్సీ, ప్లేస్‌మెంట్ సేవలను సీతం విద్యార్థులకు అందిస్తుంది. ఈ సందర్భంగా సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ సీతం విద్యార్థులు అమెరికా, ఇంగ్లండ్ ,జర్మనీ లాంటి వివిధ దేశాలలో ఉన్నత విద్యలను అభ్యసించడానికి, ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ ల ద్వారా ఉపాధ్యాయుల ఉన్నతి కి ఈ ఒప్పందం యెంతగానో దోహదపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి. రామమూర్తి ఈ ఎమ్ఒయు ద్వారా 1,500 మంది విద్యార్థులు 100 కి పైగా ఉపాధ్యాయులు వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడానికి సహాయ పడుతుంఆని తెలియచేశారు.

సంకల్పం డ్రగ్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించిన రూరల్ సీఐ ఉపేంద్ర

విశాలాంధ్ర-రాజాం : స్థానిక జీఎంఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం అనగా 9 జనవరి 2025 తేదీన డ్రగ్స్, మద్యపానము మరియు ధూమపానం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రాజాం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతు ఉపేందర్ విద్యార్థులు ఉద్దేశించి మాట్లాడుతూ నేటి యువత విద్యార్థి దశ నుండి గంజాయి, కొకైన్, కైని, ధూమపానం, మద్యపానము, మొదలు చెడు వ్యసనాలు బారిన పడి వారి విద్యను, విజ్ఞతను, భవిష్యత్తును నాశనం చేసు కోకుండా తల్లిదండ్రులకు , గురువులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఎటువంటి వ్యసనాలకు లోనైన వారిపై కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. యువత ఎప్పుడైతే చెడు వేసనాలకు నో చెబుతారో అప్పుడు వారు నిజంగా జీవితంలో హీరోలుగా గుర్తింపబడతారని ఆయన అన్నారు. డ్రగ్స్, మద్య పానం, ధూమపానం తో పాటు రోడ్డు భద్రత, మహిళా భద్రత, సైబర్ క్రైమ్ పట్ల విద్యార్థుల్లో అవగాహన కలిగే విధంగా ఇంజనీరింగ్ విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించి, పాలకొండ రోడ్డు కేర్ ఆస్పత్రి జంక్షన్ వద్ద మానవహారం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ ఉపేంద్ర తో పాటు సంతకవిటి మండల ఎస్సై ఆర్. గోపాల్ రావు, జిఎమ్ఆర్ఐటి అసోసియేట్ డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం.వి నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ వి రాంబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.వి.ఎస్ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ డా. అరుణ్ కుమార్, వై. ఎ.నాయుడు, కానిస్టేబుల్స్ కృష్ణ, శ్రీనివాస రావు, బుచ్చింపేట మహిళా పోలీసు ఆశాలత, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు,స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను ఆదుకోవడానికి పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి

జామి ఎస్‌బిఐ బి ఎం నగేష్ బాబు

విశాలాంధ్ర-జామి : దేశవ్యాప్తంగా వృద్ధులను ఆదుకోవడాని ప్రముఖ పారిశ్రామిక వేత్తలు తగిన ప్రణాళికలతో ముందుకు రావాలని జామి స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ కె.నగేష్ బాబు అన్నారు మండలం లోని అట్టాడ బి.ఎన్.ఆర్.ఆశ్రమాన్ని కుటుంబసభ్యులతో సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఉన్న వృద్ధులకి సమయానికి భోజనం అందించే వారి అవసరం ఈ సమాజంలో పెరిగిందని, జీవితకాలం అలుపెరుగని పోరాటం చేసి అలిసిపోయిన వృద్ధుల అనుభవాలు నేటి తరం యువత కి అవసరమని గ్రామీణ ప్రాంతాల్లోని వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక అవసరాలు తీరుస్తున్నప్పటికి భోజన సదుపాయాలు లేమితో వృద్ధులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు, బి.ఎన్.ఆర్.ఆశ్రమంలో నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని, ఆశ్రమంలోని చక్కటి ప్రశాంత వాతావరణం నెలకొందని ఆనందం వ్యక్తం చేశారు వృద్ధులకు తమ వంతు సహకారం అందిస్తామని నగేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీమతి రాజేశ్వరి నగేష్,కుమారి మెహర్ దీపిక లను నిర్వాహకులు సత్కరించారు, కోరుకొండపాలెం యువజన సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో అంగరంగ వైభవంగా సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర శృంగవరపుకోట రూరల్ : రవీంద్రభారతి పాఠశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి అనగా నూతన క్రాంతి . సూర్యుడు మకర రాశిలో ప్రవేశించడాన్ని మకర సంక్రమణము అంటారు.అయితే ఈ సంక్రమణాన్నే సంక్రాంతి అంటారు.సూర్యుడి చుట్టూ భూమి పరిభ్రమించే మార్పు క్రమంలో తన చుట్టూ తాను కూడా తిరుగుతుంది.అందువలన సూర్యుడు ఆరు నెలలు ఉత్తరం వైపు ఆరు నెలలు దక్షిణం వైపు కనిపిస్తాడు.ఇలా ఉత్తరం వైపు కనిపించే క్రమమే ఉత్తరాయణం అంటారు.దక్షిణం వైపు కనిపించే క్రమం దక్షిణాయణమని రవీంద్రభారతి ఉత్తరాంధ్ర జోనల్ ఇంచార్జ్ యెన్.వెంకటేష్ అన్నారు.మనకు ఒక సంవత్సరం కాలము అయితే దేవుళ్ళకు ఒక రోజు. అయితే ఒక రోజులో పగలు అనేది ఉత్తరాయణం. రాత్రి అనేది దక్షిణాయణం.. ఈ ఉత్తరాయణమనేది అందుకే మనకు అంత ముఖ్యం.. ఈ రోజు కోసమే భీష్ముడు ఎదురుచూసి ఉత్తరాయణ పుణ్య ఘడియలలోనే పరమపదించారని సీ.జీ.యం జీ.ఆర్. వసంత అన్నారు.ఈ పండుగను పెద్ద పండుగగా ఆంధ్రులు జరుపుకుంటారు. సంక్రాంతిని మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా చేసుకుంటారు. మొదటి రోజు భోగి, రెండవ రోజు మకర సంక్రాంతి, మూడవ రోజు కనుమ. కొన్ని ప్రాంతాలలో నాలగవ రోజు ముక్కనుమగా జరుపుకుంటారు. ఈ మూడు రోజులలో మొదటి రోజు భోగిమంటలతో, రెండవ రోజు పొంగలి, పిండివంటలతో, పితృ దేవతల, దేవుళ్ళ పూజలతో, మూడవ రోజు గో పూజలతో మూడురోజుల పండుగ ఎంతో ఆనందంగా కొనసాగుతుంది అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నారు.

తిరుపతి తొక్కిసలాట దురదృష్టకరం : సిపిఎం

విశాలాంధ్ర-బొబ్బిలి : ప్రతి సంవత్సరం వైకుంఠ ఏకాదశి సందర్భంగా లక్షలాదిమంది భక్తులు తిరుపతి చేరుకోవడం ఆనవైతిగా జరుగుతుంది. లక్షల మంది భక్తులు వస్తారని తెలిసి అధికార యంత్రాంగం సరైన ఏర్పాట్లు చేయకపోవడం యంత్రాంగం యొక్క వైఫల్యంగా కనబడుతుందని సిపిఎం నాయకులు పి. శంకర్రావు అన్నారు. లక్షలాది మంది భక్తులు వస్తారని తెలిసి కూడా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం ఈ విషాద ఘటనకు కారణమని అన్నారు. తిరుపతిలో 9 కౌంటర్లు తిరుమలలో ఒక కౌంటర్ ఏర్పాటు చేశారని ఆ కౌంటర్ దగ్గర కేవలం 4గురు పోలీసులు ను మాత్రమే ఉన్నారని భక్తులు చెబుతున్నారు. హైందవ శంఖారావానికి, విశాఖపట్నం ప్రధాని మోడీ గారు వచ్చినప్పుడు వేలాదిమంది పోలీసులును పక్క జిల్లాల నుండి రప్పించి బందోబస్తు ఏర్పాటు చేసిన అధికార యంత్రాంగం వైకుంఠ ఏకాదశికి లక్షలాదిమంది భక్తులు వస్తారని తెలిసి కూడా సరైన ఏర్పాట్లు చేయకపోవడం దారుణమని ప్రజల పట్ల తీవ్రమైన నిర్లక్ష్యం కనబడుతుందని అన్నారు. తిరుమల చరిత్రలో ఇటువంటి ఘటనలు జరిగిన సందర్భాలు లేవని అన్నారు.

కోడి పందాలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు :వల్లంపూడి ఎస్సై దేవి

విశాలాంధ్ర-వేపాడ: రానున్న సంక్రాంతి సంబరాలు,తీర్థ మహోత్సవాల సందర్భంగా కోడి పందాలు,పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్సై బి.దేవి హెచ్చరించారు.శృంగవరపుకోట రూరల్ సి.ఐ.పి.అప్పలనాయుడు ఆదేశాల మేరకు కోడిపందాలు పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై ఇప్పటికే నిఘా పెట్టామన్నారు.కావున సంక్రాంతి పండగ వస్తున్న నేపథ్యంలో గ్రామాలల్లో ఎక్కడైనా కోడి పందాలు, పేకాటలు నిర్వహిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవన్నారు.కోడి పందాలు,పేకాటలు నిర్వహించడం, బెట్టింగు లకు పాల్పడడం చట్టరీత్యా నేరమన్నారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా,లేదా అటువంటి వ్యక్తులను ప్రోత్సహించినా ఉపేక్షిం చేది లేదని,వారిపై కఠిన చర్యలుతప్పవన్నారు. ఇందుకుగాను కోడి పందాలు నిర్వహించే వారిపైనా, కోడి కత్తులను తయారు చేసే వారిపైనా, కోడిపుంజులకు కత్తులు కట్టిన వారిపైనా నిఘా పెట్టామన్నారు. గతంలో ఇదే తరహా నేరాలకు పాల్పడి,అరెస్టు అయిన వ్యక్తులను ఠాణాకి పిలిచి మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేటు వద్ద బైండోవరు చేయాలని,అసాంఘిక కార్యకలాపాలు చేపట్టకుండా బాండులను రాయించాలని రూరల్ సీఐ,పి.అప్పల నాయుడు ఆదేశాలు జారీ చేశారని ఆమె తెలిపారు.

పరిష్కరించిన దరఖాస్తులను ఆడిట్ చేస్తాం

రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతీ దరఖాస్తును పరిష్కరించాలి

12 లోగా పైలెట్ గ్రామాల సరిహద్దులను ఖరారు చేయాలి

కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం : రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతీ దరఖాస్తును తప్పనిసరిగా, సానుకూలంగా పరిష్కరించాలనీ జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, తాసీల్దార్లు పరిష్కరించిన ప్రతి దరఖాస్తును ఆడిట్ చేస్తామని చెప్పారు. సదస్సుల్లో మొత్తం 6846 దరఖాస్తులు రాగా, వీటిలో 4924 దరఖాస్తులు రెవెన్యూ కు సంబంధించినవే అని చెప్పారు. ఈ దరఖాస్తులను పరిష్కరించితే జిల్లాలో రెవెన్యూ పరమైన సమస్యలన్నీ దాదాపు పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కోర్టులనుంచి ప్రత్యేకంగా ఏమైనా ఆదేశాలు ఉన్నవి మినహా, వివాదాలున్న భూములను కూడా పరిష్కరించవచ్చునని సూచించారు. రీ సర్వేకై ప్రతీ మండలంలో ఎంపిక చేసిన పైలెట్ గ్రామాల సరిహద్దులు, ప్రభుత్వ భూముల హద్దులను ఈ నెల 12 లోగా ఖరారు చేయాలని ఆదేశించారు. ఫ్రీ హోల్డ్ భూముల వివరాల ఆన్లైన్ నమోదు ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తిచేయాలని స్పష్టం చేసారు. ప్రతీ ఫైలు ఈ ఆఫీసులో మాత్రమే పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు జెసి సేతు మాధవన్ మాట్లాడుతూ, పైలెట్ గ్రామాల సరిహద్దులను ఖరారు చేసే విషయంలో సర్వేయర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారని మండి పడ్డారు. రీసర్వే, రెవెన్యూ సదస్సులు, రీ సర్వే పీజీఆరెస్, ఫ్రీ హోల్డ్ భూములకు సంభందించి సమీక్షించారు. సమావేశంలో డిఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవోలు డి.కీర్తి, రామ్మోహన్, సత్యవాణి, కెఆర్ఆర్సి ఎస్డిసి మురళీ, సర్వే ఏడి రమణమూర్తి, తహసీల్దార్లు, సర్వేయర్లు, డిటీలు పాల్గొన్నారు.

గృహనిర్మాణ శాఖ ఏ.ఈ గా జి.గంగాధర్

విశాలాంధ్ర-వేపాడ : మండలం గృహ నిర్మాణ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్గా గోగాడ గంగాధర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో వేపాడ గృహ నిర్మాణ శాఖలో వర్క్ ఇన్స్పెక్టర్గా పనిచేసి పదోన్నతపై బొండపల్లి మండలం ఏఈ గా బదిలీపై వెళ్లారు.మరల వేపాడకు గృహ నిర్మాణ శాఖ ఏఈగా బదిలీపై రావడంతో ఇక్కడ ఏఈగా పనిచేసిన గంటా అప్పలనాయుడు బొండ పల్లి మండలం బదిలీపై వెళ్లారు.

గర్భిణీలకు ఉచితంగా భోజనాల పంపిణీ

విశాలాంధ్ర -జామి: మండల కేంద్రమైన జామిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గర్భిణీలకు నెలవారీ తనిఖీలను గురువారం నిర్వహించారు. ఈతనిఖీల నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన గర్భిణీలకు, వారి సహాయకులకు, ఆశాలకు,వైద్య సిబ్బందికి ఉచితంగా భోజన వసతిని ప్రతీ నెలా జామిలోని సత్యసాయి భజనమండలి సాయి ప్రేమామృతం పేరున ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా జామికి చెందిన స్వర్గీయ గొర్రిపాటిగంగాకృష్ణ ప్రసాద్ రెండవకుమార్తె ఇందుమతి ఈనెల భోజనాలను ఉచితంగా అందజేసారు. ఈభోజన కార్యక్రమాన్ని ఆసుపత్రి వైద్యాధికారిణి డా.సామ్రాజ్యలక్ష్మి ప్రారంబించారు. ఈకార్యక్రమంలో సత్యసాయి భజనమండలి నిర్వాహకులు విన్నకోట నానాజీ, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానం వైసీపీపార్టీ సిద్ధాంతం

మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర -విజయనగరం టౌన్ : అంబేద్కర్ ఆలోచన విధానం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని జిల్లా పరిషత్ చైర్మన్, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ, స్వరాజ్ మైదానం, 125 అడుగుల సామాజిక న్యాయ మహాశిల్పం, అంబేద్కర్ స్మృతి వనం,125 అడుగుల డాక్టర్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ జరిగి 19 జనవరి నాటికి ఏడాది కాలం పూర్తి అయిన తరుణంలో ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ రూపొందించిన కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానమే మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ ఆలోచన విధానం అని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంబేద్కర్ సిద్ధాంతాలకు విస్మరిస్తుందన్నారు.దీనికి ప్రత్యక్ష ఉదాహరణ 9 ఆగస్టు 2024 న 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం పై దాడి చేసిన నిందితులపై నేటికీ చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. దళిత ఐఏఎస్ ఐపీఎస్ అధికారులపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత ధోరణి అవలంబిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ రైట్స్ ఫోరమ్ ప్రతినిధులు భానుమూర్తి, దారాన వెంకటేష్, వేముల వంశీ, బుద రాయవలస మధుసూదన రావు, ఆంధ్రప్రదేశ్ టూరిజం మాజీ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ విశాఖ పర్యటన విజయవంతం

విశాలాంధ్ర-గజపతినగరం : దేశ ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం విశాఖ లో జరిగిన బహిరంగ సభ విజయవంతమైన సందర్భంగా గురు వారం సాయంత్రం బిజెపి కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఈశ్వరరావు విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోడీ పర్యటన విజయవంతం చేసి ఈ రాష్ట్రానికి మన ప్రధాని 1.99 లక్షల నిధులు కేటాయించి పలు ప్రాజెక్టులు శంకుస్థాపన చేసి సభ విజయవంతమైందని ఆంధ్ర రాష్ట్రానికి బిజెపి ఎన్నడు ఏ ప్రభుత్వము చేయని అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసి ఇటు రైల్వే జోన్ బిజెపి పార్టీ ఈ తెలుగు రాష్ట్రానికి ఎంతో చేయూతనిచ్చి నిధులు కేటాయించడం ప్రజలందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు ఈ రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అలాగే డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం శ్రమ ఎంతో త్యాగాలు చేస్తున్నారన్నారు. ప్రజలందరి కోసం కోటమే ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వానికి మనందరం మద్దతు పలకాలని దేవరకోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు పాగిరి గౌరీ . ఇనుముల సింహాచలం కార్యకర్త శీను తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాలు పేకాట పై కఠిన ప్రత్యేక నిఘా

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలం లో సంక్రాంతి పండగ సందర్భంగా కోడిపందాలు పేకాటలు ఎవరైనా ఎక్కడైనా ఆడిన నిర్వహించిన. వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల పోలీస్ స్టేషన్లోగురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్సై జె.లోకేశ్వరరావు ఈ సంక్రాంతి సంబంధించి కోడిపందాలు,పేకాట, ఎటువంటి నిబంధనలు సడలింపు లేదని కావున కచ్చితంగా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంతకుముందు కేసులు ఉన్న వారిపై బైండోవర్ చేస్తామని. ఇంతక ముందు నిర్వహించిన వారిపై నిఘా ఉంటుందని హెచ్చరించారు.

పలు పత్ర కషాయాల తయారీ వినియోగంపై అవగాహన

రీజనల్ అధికారి హేమసుందర్

విశాలాంధ్ర-వేపాడ : ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు పలు పత్ర ద్రావణం తయారీపై దాని వినియోగంపై అవగాహన కలిగిస్తున్నట్లు జిల్లా రీజనల్ అధికారి హేమ సుందర్ అన్నారు. గురువారం డిపిఎం ఆనందరావు ఆదేశాల మేరకు మండలంలోని కుమ్మపల్లి గ్రామంలో ప్రకృతి యూనిట్ ఆధ్వర్యంలో మామిడి తోటలో ట్రాక్టర్ ట్యాంక్ లో పలుపత్ర ద్రావణం 500 లీటర్ల 2000 లీటర్లు నీటిలో కలిపి స్ప్రేయింగ్ చేయించారు. వేరుసెనగలో వేసిన అంతర పంటలను సరిహద్దు పంటలను పరిశీలించారు. అలాగే గ్రామంలో సామూహికంగా మహిళా రైతులచే పలుపత్ర ద్రావణం. 200 లీటర్లు జిల్లేడు ద్రావణం 100 లీ.అగ్నిస్త్రం 100 లీటర్లు క్వాలిటీ ద్రవ జీవామృతం 200 లీటర్లు ద్రావణాలు తయారు చేయించారు. గ్రామంలో ఉన్నటువంటి అన్ని రకాల పంటలకు ఉపయోగించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమం మండల సమైక్య అధ్యక్షురాలు హాజరయి. మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి సభ్యులకు కషాయాలు వినియోగం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబల్ మండల కో ఆర్డినేటర్ ఆర్.వి స్వామి నాయుడు, ఎం.టి. సన్యాసమ్మ యూనిట్ ఇంచార్జ్ నారాయణమ్మ కుమ్మపల్లి యూనిట్ సిబ్బంది హాజరయ్యారు.

నారాయణ పబ్లిక్ స్కూల్లో "ప్రవాసీ భారతీయ దివస్"

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలోగల నారాయణ పబ్లిక్ స్కూల్లో "ప్రవాసీ భారతీయ దివస్"ను నిర్వహించారు. ముందుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గాంధీచిత్రప టానికి పూలమాలతో అలంకరించి ప్రవాసీ భారతీయులకు సెల్యూట్ తో వందనం చేశారుఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ గాంధీజీ దక్షిణఫ్రికా నుండిభారత్ తిరిగి వచ్చిన జనవరి 9వ తేదీని ప్రవాసీ భారత- య చివసీగా జరుపుకోవడం భారతీయులు గర్వించదగ్గ విషయమని, ప్రవాసీ భారతీయులు మనదేశ సంక్షేమానికి, అభివృద్ధికి పాటుపడడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు విద్యార్థులు విద్యార్థి దశ నుండే మాతృభూమికి సేవ చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-రాజాం : జ్ఞానజ్యోతి విద్యాలయంలో ముందుగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరిగినది. విద్యార్థులచే వివిధ రకాల వేషధారణలు నృత్యాలు భోగి మంటలు వేసి ఆటపాటలతో అలరించడం జరిగినది.భోగి, సంక్రాంతి, కనుమ మూడు రోజుల వండగ విశిష్టతను గూర్చి పిల్లలకు తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో జ్ఞానజ్యోతి విద్యాలయం కరస్పాండెంట్ నడికుప్పల తారకేశ్వరరావు, ప్రిన్సిపాల్ శ్రీకాంత్ వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, మోటివేషనల్ స్పీకర్ శివకృష్ణ మరియు పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

ఫసల్ బీమా నమోదుకు ఈనెల 10 వరకూ అవకాశం

విశాలాంధ్ర-వంగర: ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదు కు ఆఖరు ఈనెల 10 వరకూ. వ్యవసాయ అధికారి తట్టికోట కన్నబాబు. వంగర జనవరి 8 ప్రధానమంత్రి ఫసల్ బీమా నమోదుకు ఈనెల 10 వరకూ అవకాశం ఉందని వంగర మండల వ్యవసాయ అధికారి తట్టికోటకన్నబాబు తెలిపారు. రబీ సీజన్ లో వరి సాగు చేస్తున్న రైతులు ఎకరానికి 630 రూపాయలు ప్రీమియం ఇన్సూరెన్స్ చెల్లిస్తే ప్రభుత్వం ఎకరానికి 42 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లిస్తుందన్నారు. గత నెల చివరి నాటికి గడువు పూర్తయినప్పటికీ ఈ నెల 10 వరకు ప్రభుత్వం పొడిగించారన్నారు. ఆధార్ కార్డు వన్ బి రైతు సేవా కేంద్రం ద్వారా పొందిన పంట నమోదు పత్రం బ్యాంక్ ఎకౌంటు పత్రాలతో మీసేవ కేంద్రాల్లో రైతులు బీమా నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రైతు ఈ చక్కని అవకాశాన్ని వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారి కన్నబాబు సూచించారు.

గురుకులంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

పాఠశాల ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్

విశాలాంధ్ర-వేపాడ : మండల కేంద్రమైన వేపాడ శివారు బక్కు నాయుడుపేటలో గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల ఆశ్రమ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఎం ఫ్లోరెన్స్ తెలిపారు.సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు సనాతన సంప్రదాయ కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ భోగి మంటలు వేసి రంగోలి ముగ్గులు వేయించారు.సంక్రాంతి హరిదాసు వేషధారణలో విద్యార్థిని హరినామ స్వరం చేసి బియ్యం స్వీకరించడం గంగిరెద్దు వేషధారణ వంటి సాంప్రదాయ పద్ధతులలో విద్యార్థులు నూతన వస్త్ర అలంకరణలతో సాంప్రదాయ దుస్తులుగా ధరించి పల్లెల్లో జరిగే సంక్రాంతి సంబరాలు దీటుగా విద్యార్థులు థింసా,కోలాటం వంటి సాంస్కృతిక,కార్యక్రమాలు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

బొద్దాం ఎంపీపీ పాఠశాల సందర్శన

ఎంఈఓ జి. జగదీశ్వర రావు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జి. జగదీశ్వర రావు గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల డైరీలు లెసన్ ప్లాన్స్ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం టెస్టింగ్ రిజిస్టర్ తనిఖీ చేశారు. డైరీలు లెసన్ ప్లాన్లు టెస్టింగ్ రిజిస్టర్ అప్డేట్ గా ఉండాలని సూచించారు.విద్యార్థుల వర్క్ బుక్స్ చూసి అకాడమిక్ క్యాలెండర్ ప్రకారంగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థుల వర్క్ బుక్ ను వ్రాయించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్‌గా వెంకటేశ్వర్రావు

విశాలాంధ్ర-విజయనగరం: ఎపి మార్క్ఫెడ్ జిల్లా మేనేజర్‌గా ఎన్.వెంకటేశ్వర్రావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇంతకుముందు ఉద్యానశాఖలో విధులు నిర్వహిస్తూ, డిప్యుటేషన్‌పై డిఎంగా చేరారు. ఇంతకుముందు ఈ స్థానంలో వై.విమలకుమారి డిఎంగా పనిచేసి, పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీపై వెళ్లారు. ముందుగా మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కు కలిసి అనుమతి తీసుకున్న అనంతరం వెంకటేశ్వర్రావు డిఎంగా బాధ్యతలను స్వీకరించారు.

కొత్తగా నిర్మించిన గోకులాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

10 నుంచి 12 వరకు 492 గోకులాలు ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు

విశాలాంధ్ర-విజయనగరం : జిల్లాలో నిర్మాణం పూర్తయిన గోకులాలను ఈనెల 10 నుంచి 12వ తేదీ పాటు మూడు రోజుల్లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఎంపిడిఓలను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం గోకులాలను ప్రారంభోత్సవాలను నిర్వహించాలని ఆదేశాలు జారీచేసిందని, ఈ మేరకు ఆయా మండలాల్లో ప్రజా ప్రతినిధులతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలోని ఎంపిడిఓలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ జిల్లాలో 981 గోకులాలను మంజూరు చేయడం జరిగిందని, నిర్మాణంలో వున్న వాటిని నెలాఖరుకల్లా పూర్తిచేసి వాటిని కూడా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో గోకులాల ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలో పూర్తయిన ఉపాధిహామీ పనులకు సంబంధించిన బిల్లులను ఆన్‌లైన్ లో వెనువెంటనే అప్ లోడ్ చేయాలని సూచించారు. రూ.45 కోట్ల విలువైన 866 పనులను పూర్తిచేసినప్పటికీ రూ.23 కోట్ల బిల్లులనే అప్ లోడ్ చేశారని, అందువల్ల పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులను కూడా వెంటనే అప్ లోడ్ చేయడంపై శ్రద్ధ చూపాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాపరిషత్ సి.ఇ.ఓ. బి.వి.సత్యనారాయణ, డ్వామా పి.డి. శారదాదేవి, పంచాయతీరాజ్ ఎస్.ఇ. శ్రీనివాస్, డిపిఓ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ క్రికెట్ టీం ఎంపికలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జేఎన్టీయూ జి.వి యూనివర్సిటీ క్రికెట్ పురుషులక్రికెట్ జట్టు ఎంపికలలు ప్రారంభం అయ్యాయి .ఈ ఎంపికలను రఘు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డి రాజ్యలక్ష్మి , రిజిస్ట్రార్ జి జయసుమ తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా విచ్చేసిన రఘు విద్య సంస్థల చైర్మన్ రఘు కలిదిండి గారు ప్రారంభించారు. వివిధ అనుబంధ కళాశాల విద్యార్థులు పాల్గొనడం జరిగినది . ఈ సందర్భముగా క్రీడాకారులను ఉద్దేశించి ,విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలోనూ రాణించాలని ఎంపిక అయిన జట్టు ను ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ లో అత్యుత్తమ ప్రతిభ కనబరచి మన యూనివర్సిటీ కి మంచి పేరు తీసుకురావాలని కోరారు . ఎంపిక కాని విద్యార్థులు నిరాశ చెందకుండా ప్రాక్టీసు కొనసాగించి నైపుణ్యాన్ని పెంచుకోవాలని చెప్పారు. ఎంపికైన జట్టు యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నందు 16 నుంచి 21వ తేదీ వరకు జరిగే టోర్నమెంట్లో పాల్గొంటారని సెలక్షన్ కమిటీ చైర్మన్ స్థానిక కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి హెచ్ శ్రీనివాసులు , ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జి.సూర్యనారాయణ రాజు తెలిపారు . ఈ సెలక్షన్ కమిటీ మెంబెర్స్ గా డాక్టర్ పనింద్ర,డాక్టర్ రామకృష్ణ పివి రమణ, వ్యవహరించారు. ఈ కార్యక్రమం లో వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ టీవీ కే ఎల్ ఎన్ ప్రసాద్, సిహెచ్ రవి, ఎంఎన్ శ్రీనివాస్, రజనీకాంత్,బాలాజీ,మహేష్,బంగార్రాజు పాల్గొన్నారు.

తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలి : గిరిజనుల ఆందోళన

విశాలాంధ్ర-మెంటాడ: సిపిఎం, గిరిజన సంఘం అధ్వర్యంలో గురు వారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు ఆందోళన చేపట్టారు.కూనేరు పంచాయతీ మధుర గిరిజన గ్రామాలు ఎగువ మిర్తివలస,దిగువ మిర్తివలస,ఉద్దంగి పంచాయతీ మధుర గిరిజన గ్రామం కొత్తూరు గ్రామంలో త్రాగునీరు, రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇక్కట్లు పడుతున్నారని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి సోములు డిమాండ్ చేశారు.ఈ సంధర్భంగా ధర్నా నిర్వహించారు. కలుషితమైన కొండవాగులనీటిని గిరిజనులు వాడుకుంటున్నారు.దీంతో అనారోగ్యం పాలై ఆర్థికంగా వెనుకబడి పోతున్నారు.కొత్తూరు గిరిజన గ్రామం లో ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా మూడేళ్ల క్రితం బోరుబావి తీసారు.ఆ బోరుబావి ద్వారా బురదనీరు రావడంతో ఇక్కడ గిరిజనులు వాగుల నీటినే వినియోగిస్తున్నారు.తక్షణమే ఆయా గిరిజన గ్రామాలకు తాగునీరు, రహదారి సౌకర్యం కల్పించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాములు డిమాండ్ చేశారు.అనంతరం ఎంపిపి, ఎంపిడిఓ రెడ్డి సన్యాసి నాయుడు,ఎం భానుమూర్తి లకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమం లో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు పలువురు సర్పంచులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

సాదా సీదాగా సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-మెంటాడ: స్థానిక ఎంపిడిఓ సమావేశ మందిరం లో గురు వారం సర్వసభ్య సమావేశం సాదాసీదా జరింగింది.ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సంధర్భంగా వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలు సమర్పించారు.గత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలు ఈ సమావేశంలో పరిష్కారం దిశలో వున్న పనులను చదివి వినిపించారు.ఈసమావేశానికి హాజరు కాని అదికారులు వచ్చే సమావేశానికి తప్పక హాజరు కావాలని, హాజరు కాని పక్షంలో చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన ఎంపిపి రెడ్డి సన్యాసి నాయుడు అన్నారు.ఈ కార్యక్రమం లో ఎంపిడిఓ ఎం భానుమూర్తి, డిప్యూటీ తహసిల్దార్ వెంకటరావు,వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు,ఎఓ గోకుల్ కృష్ణ, హౌసింగ్ ఏఈ డేవిడ్ ప్రసన్న కుమార్, ఎంపిటిసి లు పతివాడ కుమార్,రెడ్డి ఎర్రన్నాయుడు, పలువురు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాంలో పలు అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-తెర్లాం: తెర్లాం మండలం కూనయవలస, జన్నివలస గ్రామాలలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన , మాజీ ఎమ్మెల్యే టి.లక్ష్మునాయుడు సహకారంతో విడిదల అయిన నిధులతో జరుగుతున్న నూతన రోడ్లు మరియు కల్వర్టులు. ఎక్స్ ఎం పి పి బోదెల. సింహాచలం అధ్వర్యంలో జరుగుతుండటంతో ఆయా గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాంట్రాక్ట్ & ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ జిల్లా శాఖ క్యాలెండర్ ను గురువారం విజయనగరం జిల్లా కలెక్టర్ డా. బి.ఆర్. అంబేద్కర్ ఐఏఎస్ చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఇతర కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో కాంటాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ విజయనగరం జిల్లా అధ్యక్షులు గండిపల్లి మహేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి పలికల శీను, అసోసియేషన్ సభ్యులు బి.కిషోర్ ఏ.వి. చంద్ర శేఖర్, ఎస్. ఈశ్వర్, ఏ. మాధవ్, దారా వెంకట్, కె. జనార్ధన్ పాల్గొన్నారు.

..